పార్కింగ్ స్థలాల్లో వ్యాపారాలు



పండ్ల వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)



రాజధాని టీ ప్యాలెస్ వద్ద నిలిచిన ట్రాఫిక్

- మున్సిపల్ కమిషనర్ హెచ్చరించినా మారని తీరు
- రోడ్లపైన వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తున్న పోలీసులు
- దిక్కుతోచని స్థితిలో వాహనదారులు

పరకాల : అసలే ఇరుకు రోడ్లు. అలాంటి రోడ్లపై వాహనాల రవాణానే కష్టతరంగా మారుతుండగా వ్యాపారుల నిర్లక్ష్యం పలువురుని మరింత ఇబ్బందులకు గురిచేస్తుంది. ప్రమాదాలు జరిగితే తమకేం సంబంధం అన్నట్లు వ్యవహరిస్తూ ప్రజలకు, వాహనాదారులను ఇబ్బందుల్లో నెట్టేస్తున్నారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల హుజూరాబాద్ రోడ్డు, వెల్లంపల్లి రోడ్డు, జయ డీలక్స్ రోడ్డుని ఆనుకుని వ్యాపారస్తులు దుకాణాల ముందు సామగ్రిని ఉంచడంతో పాటు పండ్ల వ్యాపారులు తోపుడు బండ్లతో ప్రధాన రోడ్లు, పార్కింగ్ స్థలాలను ఆక్రమించుకోవడంతో పార్కింగ్ కష్టాలు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు. వాహనాలను ఇతర ప్రదేశాల్లో నిలిపివే పోలీసులు జరిమానాల విధిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

కమిషనర్ హెచ్చరికలు బేఖార్..

రోడ్లపైనా వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సుష్మ స్వయంగా దుకాణాల వద్దకు పోలీసులతో వచ్చి హెచ్చరించినా పలువురు వ్యాపారుల తీరు మారడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పండ్లు విక్రయించే వ్యాపారులు ప్రధాన రహదారులపైనా, పార్కింగ్ స్థలాల్లో వారి వ్యాపారాలను అలాగే కొనసాగించడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ హెచ్చరించినా తీరు మారలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం




రోడ్లపైన వ్యాపారాలు చేయొద్దని ముందుస్తు హెచ్చరికలు జారీ చేశాం. అయినప్పటికీ కొందరు పట్టించుకోవడం లేదని మా దృష్టికి వచ్చింది. వాహనదారులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తాం.

- క్రాంతికుమార్, సీఐ

క్లుప్తంగా

సోషల్ మీడియాలో పోస్ట్‌కార్డు వైరల్



వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఇట్టబోయిన భూపతిరాజ్ పేరుతో సోషల్ మీడియాలో పోస్టుకార్డు చక్కర్లు కొడుతోంది. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన శ్రీహరికి ఓటు వేసి గెలిపించామని, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల కృషితో గెలిచి స్వార్థం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరారని, కష్టపడిన కార్యకర్తలను మోసం చేశారని, రైతుల కష్టాలను తీర్చడం లేదని, మాట తప్పినందుకు వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని రాసిఉన్న ఉత్తరం సోషల్ మీడయాలో వైరల్ అవుతుంది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



కమలాపూర్ : మండలంలోని వంగపల్లికి చెందిన నకీర్త రాజు కొద్ది రోజుల క్రితం వన్‌ప్లస్ కంపెనీకి చెందిన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వెంటనే కమలాపూర్ పోలీసులను ఆశ్రయించాడు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రాజు పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా బుధవారం బాధితుడు రాజుకు అందించారు. దాని విలువ రూ.40 వేలు ఉంటుందని, సెల్‌ఫోన్ అప్పగించిన ఇన్‌స్పెక్టర్ హరికృష్ణకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

ఎమ్మెల్యే 'రేవూరి'కి వినతిపత్రం అందజేత

పరకాల : పట్టణం శివారులో గల పెద్దచెరువు సమీపంలోని పెద్దమ్మ గుడికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. పెద్దమ్మ తల్లి గుడి నుంచి 100 పడకల ఆస్పత్రి వరకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. మాజీ కౌన్సిలర్ జయమ్మ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో పయనించాలి



శాయంపేట : యువత సన్మార్గంలో పయనించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఎస్సై జక్కుల పరమేశ్ సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో జాగృతి పోలీస్ కళాబృందం మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఎస్సై హాజరై మాట్లాడారు. ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మొద్దని అన్నారు. యువకులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయొద్దని, చిన్న పిల్లలను పనులకు పంపించొద్దని అన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, యువకులు బెట్టింగ్ ఆప్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఏఎస్సై కుమారస్వామి, జాగృతి పోలీస్ కళాబృందం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల అవగాహన ర్యాలీ



ధర్మసాగర్ : మండలంలోని ఉనికిచర్ల గ్రామంలో పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్) ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1 స్పెషల్ క్యాంపు బుధవారం కొనసాగింది. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామంలో ఎయిడ్స్ వ్యాధితో వచ్చే ప్రమాదాలు, నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై స్కిట్, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ సామ్యూల్, ప్రవీణ్ క్యాంపును సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కవిత, రామరత్నమాల, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో పాటు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



వైద్యులతో మాట్లాడుతున్న తహసీల్దార్

దామెర : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి సూచించారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల మహాత్మా జ్యోతిబాపూలే, మైనారిటీ గురుకుల పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన మెడికల్‌ను పరిశీలించి వైద్యులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజనం, వంటశాల, డైనింగ్‌హాల్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు రుచి, సుచికరమైన భోజనం అందించాలన్నారు. వంట గదితోపాటు డైనింగ్‌హాల్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట ఆర్‌ఐ సంపత్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పరామర్శ



ఐనవోలు : మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన బుర్ర సాంబరాజు(41) మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి మృతిచెందిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బుధవారం ఎంజీఎం మార్చురీలో ఉన్న సాంబరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

అమరవీరుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభ్యున్నతికి పాటుపడాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. అలాగే పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు జెండా ఆవిష్కరించారు. అనంతరం అమరధామం, అమరవీరుల స్మారక భవనంలో అమరులకు నివాళులర్పించారు. అదే విధంగా దామెర, ఆత్మకూరు, శాయంపేట, నడికూడ, ఐనవోలు, ఎల్కతుర్తి, వేలేరు ఎంపీడీఓ కార్యాలయాల్లో ఎంపీడీఓలు, తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్‌లు, కమలాపూర్ ఎంజేపీలో ఉపాధ్యాయులు, జాతీయ జెండా ఆవిష్కరించారు. అలాగే బీజేపీ కార్యాలయాల్లో ఆపార్టీ నాయకులు జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. ఐనవోలులో సీపీఎం నాయకులు ర్యాలీ నిర్వహించి అమరులకు నివాళులర్పించారు.

- సాక్షి నెట్‌వర్క్



పరకాల : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



కమలాపూర్ : ఎంజేపీలో..



ఆత్మకూరు : బీజేపీ కార్యాలయంలో..



శాయంపేట : ఎంపీడీఓ కార్యాలయంలో..



ధర్మసాగర్‌లో..



నడికూడలో..



ఐనవోలు : మాట్లాడుతున్న లింగయ్య



ఎల్కతుర్తి : తహసీల్దార్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



వేలేరు : తహసీల్దార్ కార్యాలయంలో..



దామెర : జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్



ఆత్మకూరు : ఎంపీడీఓ కార్యాలయంలో..

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

శాయంపేట : మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పురోహితులు గుటోజు రాజుచారి గణపతి పూజ, నవగ్రహ పూజ, పుణ్యాహవచనం, విశ్వకర్మ భగవాన్ పూజ, యజ్ఞం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు సలేంద్ర రవీంద్రచారి, జిల్లా నాయకులు శంకరాచారి, కృష్ణమూర్తి, రాంగోపాల్, సురేంద్రచారి, చంద్రమూర్తి, ప్రసాద్, ఓంకార్, అశోక్, సలేంద్ర వీరనర్సయ్య, రవీంద్రాచారి, సత్యం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు / నడికూడ : ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్ల, నడికూడ మండల కేంద్రంలో బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మకు, పోచమ్మతల్లికి పూజలు నిర్వహించారు. విశ్వకర్మ జెండా ఆవిష్కరించారు. ఆ సంఘం అధ్యక్షుడు వినోదాచార్య, ఉపాధ్యక్షుడు అన్నమాచారి, కోశాధికారి శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, కోటిలింగాచారి, రాజేశ్వరాచారి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ముద్ద చర్మ వ్యాధి టీకాలను వేసినట్లు మండల పశు వైద్యాధికారి సునీల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ముద్దచర్మ వ్యాధి కేవలం తెల్ల పశువుల్లో (ఆవులు, ఎద్దులు, లేగ దూడలు) మాత్రమే ప్రబలుతుందని, బిళ్లల రూపంలో చర్మం మీద చిన్నచిన్న గడ్డలు ఏర్పడుతాయని అన్నారు. అవి పగిలి సొనకారుతుందని తెలిపారు. అది మిగతా పశువులకు అంటుకోవడంతో పశువులకు కూడా సోకుతుందని, రైతులు ముందే గుర్తించి టీకాలు ఇప్పించాలని సూచించారు. పశువులను కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సీహెచ్ రమేశ్‌బాబు, రమాదేవి, ప్రమోద్, రైతులు పాల్గొన్నారు.

త్వరలోనే డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ

- కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్



డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న ప్రణవ్

కమలాపూర్ : మండలంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను త్వరలోనే అర్హులకు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్రూం ఇళ్ల మరమ్మతుల కోసం సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పూర్తి వివరాలు అందించినట్లు చెప్పారు. ప్రస్తుతం డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయని తెలిపారు. కమలాపూర్‌లో 320, గూడూరులో 50, మర్రిపల్లిగూడెంలో 50 చొప్పున డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేశ్‌గౌడ్, శ్రీనివాసరావు, భిక్షపతి, రమేశ్, డాక్టర్ కుమారస్వామి, శ్రీకాంత్, శ్రీనివాస్, రవి, యుగేందర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల నిర్వహణను ప్రైవేట్‌కు ఇవ్వొద్దు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య



మాట్లాడుతున్న ఉప్పలయ్య

కమలాపూర్ : భవన నిర్మాణ కార్మికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నిర్వహణను ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వొద్దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు యాకయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల ప్రథమ మహాసభలో వారు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూ, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక సంక్షేమ బోర్డులను ఎత్తివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. అనంతరం యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వడ్లూరి మల్లయ్య, కార్యదర్శిగా మేకల భిక్షపతి, గౌరవ అధ్యక్షుడిగా పుల్లా కొమురయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చల్లూరి వెంకటాచారి, ఉపాధ్యక్షులుగా కొలుగూరి కొమురయ్య, బెజ్జంకి శంకరాచారి, మాట్ల రాజు, కోశాధికారిగా పుల్లా రాజును ఎన్నుకున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



వేలేరు : క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

వేలేరు : క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన 6–10 తరగతి చదువుతున్న విద్యార్థులకు అండర్ 14, 17 విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంఈఓ చంద్రమౌళి, హెచ్‌ఎం సత్యం, పీఈటీలు రాజేశ్వరి, సునీల్, రాజ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాయంపేట / నడికూడ : ఈనెల 19న అండర్14, 17 (బాల, బాలికలు) మండలస్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల అధ్యక్షుడు, ఎంఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళలకు అండగా సఖి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీదేవి

ఎల్కతుర్తి : మహిళలకు సఖి సెంటర్ 24 గంటలు అండగా ఉంటుందని సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. భీమదేవరపల్లి మండలంలోని కొప్పూరు గ్రామంలో మహిళా శిశు సంక్షేమశాఖ, సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు అవగాహన కల్పించారు. గృహ హింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలు వంటి సమస్యలకు సఖి సెంటర్ ద్వారా రక్షణ లభిస్తుందని అన్నారు. సహాయం కోసం 181, 1098, హెల్ప్‌లైన్లు, 087024522111, 7382983088 నంబర్లను సంప్రదించాలని కోరారు. బాధిత మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేసు వర్కర్ భారతి, స్వరూప, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ధర్మసాగర్‌లో ఆ పార్టీ నాయకులు రక్తదానం చేశారు. ఆత్మకూరు, దామెర, ఎల్కతుర్తి, పరకాల, శాయంపేట, కమలాపూర్‌తో పాటు వివిధ మండలాల్లో బీజేపీ నాయకులు కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



కమలాపూర్ : కేక్ కట్‌చేస్తున్న బీజేపీ నాయకులు



ధర్మసాగర్ : రక్తదానం చేస్తున్న బీజేపీ నాయకుడు



ఎల్కతుర్తి : ముల్కనూరులో..



ఆత్మకూరులో..



దామెరలో..



శాయంపేటలో..

గ్రామ కమిటీ ఎన్నిక

వేలేరు : పద్మశాలి సంఘం వేలేరు గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా మార్కండేయ, సదానందం, రాజు, యుగేందర్, కోటేశ్వర్ ఎన్నికైనట్లు తెలిపారు.